కథ

# వృత్తి ధర్మం

జి.కె ప్రసాద్

**సూర్య కిరణాలు వెండి పళ్ళెంలా పర్చుకున్న మంచును చీల్చుకుంటూ, నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. ఉదయం 7గం॥ దాటినా, ఇంకా పక్కమీద నుండి లేవబుద్ధి కాలేదు. నాకు తోడు బంటిగాడు (కుక్క పిల్ల) నా పక్కలో ఎప్పుడు నక్కాడో, ఏమో? గాని, నాతో పాటు బద్ధకంగా ఇంకా పడుకొన్నాడు. నాన్న పనివాడిపై అరుస్తున్న అరుపులు. నాకు ఇంకా స్పష్టంగా వినబడుతున్నాయి.**

నేను కనబడితే "దండకం" నా వైపు ప్రవాహంలా వెల్లు వెత్తుతుందని, ఒక్క ఉదుటున లేచాను. అరగంటలో అన్ని కార్యక్రమాలు ముగించుకొని టేబుల్ దగ్గర కూర్చున్నాను. అమ్మ వేడి వేడి దోశలు చేస్తే కడుపునిండా తిని ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ పట్టుకొని బయలుదేరాను. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి. మా ఊరి బస్టాండులో వెళ్ళి నిల్చున్నాను. 20 ఏళ్ళుగా బస్టాండ్, వచ్చే బస్సులో ఎలాంటి మార్పు లేదు. రోడ్డు కాస్త మారింది. ఇంతకు ముందు మొరం రోడ్డు ఉండేది. ఇప్పుడు దానిపై తారు పోశారు. ఎలక్షన్స్ వస్తున్నాయ్ కదా! అందుకని. 20 నిమిషాలు గడిచాయి. అల్లంత దూరాన బస్సు రాక తెల్సినట్లుంది. అప్పటి వరకు క్రింద కూర్చున్న, పిల్లా, పీచు, తల్లి, బిడ్డా, అంతా సిద్ధం అయ్యారు ఎక్కడానికి. బస్సు దుబ్బ లేపుతూ మెల్లగా బస్టాండ్ దగ్గర ఆగింది. కాసేపటికి అవస్థగా కదిలింది. నీటుగా వేసుకున్న ఇస్త్రీ బట్టలు కాస్త నలిగిపోయాయి. ఎలాగోలా బస్సు మధ్యలో వెళ్ళేసరికి..

"నమస్కారం శివయ్యగారూ"...అంటూ వెనక నుండి ఓ స్వరం వినిపించింది. నా అవస్థ చూడలేక, పరిచయస్థుడు తనకున్న కొద్దిపాటి సీటులో సర్దుతూ, కూర్చోమని ఆహ్వానించాడు. కాదనలేక వెళ్ళి కూర్చున్నాను. బస్సు కొండలను ఎక్కుతూ, దిగుతూ ఉన్నప్పుడు దూరంగా కనుచూపుమేర కనిపించే పచ్చిక బయళ్ళు, మేఘాలతో సూర్యుడు దోబూచులాడగా ఏర్పడే ఛాయాప్రాంతం, సుదూర కొండ ప్రాంతాల్లో ఇంకా కరగక పొగలుగా మారిన మంచుతో ఆ ప్రాంతమంతా చాలా ఆహ్లాదకరంగా వుంది. ఆగుతూ...ఊగుతూ వెళ్ళేసరికి నిద్రపట్టింది. స్టాప్ వచ్చాక కండక్టర్ వచ్చి లేపేవరకు లోకమే తెలియలేదు.

× × ×

డిపో మేనేజరుగా క్రొత్త కావడంతో, క్రిందిస్థాయి అధికారి నా పరిధిలోకి వచ్చి డిపో మండలాలు, ఆదాయం, సిబ్బంది జీతభత్యాలు, వ్యయం, రాబడి, ఖర్చులు అంతా వివరంగా వివరించి, చివరలో స్టాఫ్‌నంతా పరిచయం చేశాడు. తొలిరోజు బ్రహ్మాండంగా గడిచింది. చలికాలం కాబట్టి సాయంత్రం 5గం॥ కే ఇంటికి బయలుదేరాను. బస్సు ప్రయాణికులతో రద్దీగా ఉంది. స్కూల్, కాలేజ్, విడిచే వేళ, ఉద్యోగులు, కార్మికులు ఇళ్ళకు చేరేవేళ ఒక్కటే కావడంతో దాదాపు బస్సంతా వారితోనే నిండిపోయింది. కాసేపటికి... డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. సందడి సందడిగా ఉండటం వల్ల వినపడని గొడవ, బస్సు ఆగడంతో గట్టిగా వినపడుతుంది. కాలేజ్ కుర్రాడిని బస్ కండక్టర్ వాయించేస్తున్నాడు. ఆ కుర్రాడు రెన్యువల్ కాని పాస్‌తో ప్రయాణిస్తున్నాడు. అదీ అసలు సంగతి.

"తప్పు అయ్యింది సార్! చూస్కోలేదు. ఇంకెప్పుడు ఇలా చెయ్యను. క్షమించి వదిలేయండి సార్ ఇప్పుడు టిక్కెట్టు తీసుకుంటాను" జాలిగా వేడుకుంటున్నాడు. నూనూగు మీసాలతో, అప్పుడే నిక్కరు విడిచి, ప్యాంట్ తొడిగాడనుకుంటా! పిల్ల చేష్టలు ఇంకా పోలేదు.

"వీల్లేదు బస్ దిగాల్సిందే, తప్పుకు శిక్ష పడాల్సిందే" "ఊ...దిగు..దిగు.." తోసినంత పనిచేశాడు కండక్టర్. ఎంత బ్రతిమాలినా బెట్టు దిగడం లేదు. చీకటి పడ్తుంది. ఇంతలో ఓ పెద్దాయన లేచి

"పోనీలే బాబూ! చూస్కోలేదు అంటున్నాడు కదా! పొరపాటున జరిగింది ఏమో?...ఈ సారి వదిలేయరాదూ"...వేడుకోలు

"మీకేం తెలీదండి...అకస్మాత్తుగా ఏ చెకింగ్ ఆఫీసరయినా వస్తే, ఊడేది నా ఉద్యోగం. మీ సొమ్మేం పోతుంది. కఠినంగా బదులిచ్చాడు. మళ్ళీ అతనే

"ఈ కాలం కుర్రాళ్ళకి బరువు బాధ్యతలేదు. ఎంతసేపు పనికిరాని పాటలు, సొల్లు కబుర్లు, చెవుల్లో ఇయర్ ఫోన్లు తప్ప అవసరమైన విషయాలపై కాస్త కూడ ధ్యాసలేదు అన్నాడు. ఆఫీసర్ వంక చెప్పినా, అసలు ఉద్దేశ్యం కక్ష తీర్చుకోవాలని స్పష్టంగా తెలుస్తోంది. నన్నే బురిడి కొట్టిస్తాడా? అన్న అక్కసుతో ఊగిపోతున్నాడు. ఇక గత్యంతరం లేక ఆ కుర్రాడు బస్సులోంచి దిగిపోయాడు. చేసేదేమి లేక నేను నిస్సహాయంగా అలాగే చూస్తుండి పోయాను. బస్ కదిలింది.

ఓ ఆడమనిషి తలపై బుట్టతో, చంకలో బిడ్డతో, నిలబడలేక అవస్థ పడుతుంది. నాకు లేచి సీటు ఇవ్వాలని ఉన్నా, నేను బస్ చివరలో కూర్చొని

ఉన్నాను. మధ్యలో చాలా మంది నిలబడి ఉన్నారు. సాధ్యం కాలేదు. పైగా ఆ మహిళ గర్భవతిలా ఉంది పాపం!! నాకు చాలా జాలేసింది. ఆడవాళ్ళకు రిజర్వ్ చేసిన సీట్లలో మగవారు దర్జాగా కూర్చున్నారు. కాని ఎవరూ సీటు ఇవ్వడం లేదామెకి. పాపం ఇంతలో ఒకతను ఆమె పరిస్థితి గమనించి, సీటు ఇచ్చి అతను నిలబడ్డాడు. ఆమె కూర్చుంటూ అతని వైపు చూసిన "కృతజ్ఞతా భావం" చూపులు నా దృష్టి దాటి పోలేదు. కాసేపటికి ఆ నిలబడిన వ్యక్తి కూడా అవస్థపడటం గమనించాను. సరిగ్గా గమనిస్తే అతనిది "జైపూర్ ఫుట్" ఆహా! మానవత్వమా!! నువ్వు ఇంకా బ్రతికే వున్నావు అనుకొని.. ఇక ఆలస్యం చేయక నేను లేచి, అతనికి నా సీటు ఇచ్చాను. కాసేపటికి మాఊరొచ్చింది. ఆ రోజు అనుభవాలకు అక్షర రూపం ఇవ్వడానికి నా డైరీలోని పేజీలు సరిపోలేదు.

× × ×

6 నెలల తర్వాత.....

నేను ఆఫీస్‌కి వెళ్ళేసరికి "అర్జంట్ యాక్షన్ ఫైల్" లో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ప్రవర్తించి, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించినందుకు, సదరు కండక్టర్ పై శాఖాపరమైన చర్య తీసుకోవాల్సిందిగా ఓ లేఖ ఉంది. అది చూస్తుండగానే, అటెండర్ వచ్చి

"సర్! మిమ్మల్ని కలవడానికి కండక్టర్ రాంబాబు వచ్చాడు." అన్నాడు. నేను చదివిన లేఖలో నిందారోపణలు చేయబడిన వ్యక్తి అతను. లోపలికి పంపించు అన్నట్లు సైగ చేశాను. రాంబాబును చూడగానే నా కోపం తారాస్థాయికి చేరింది. వినయంగా నమస్కరిస్తూ అతను.

"సర్! ఏదో చిన్న పొరపాటు జరిగింది. తమరు చూసి చూడనట్లు వదిలేస్తే మరోసారి ఇలా జరగకుండా చూస్తాను'' దీనంగా ప్రార్థిస్తున్నాడు.

"ఎందుకు? వదిలిపెట్టాలి" అన్నాను.

"సర్, ఇప్పటికే 2 మెమోలు ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా ఇంక్రిమెంట్ కటింగ్ అంటే నేను, నా కుటుంబం ఇబ్బంది పడాల్సి ఉంటుంది. నాకు ఎదిగిన పిల్లలు ఉన్నారు. నా పై దయచేసి కరుణించండి." అన్నాడు.

"ఇప్పుడు నీకు బాధ తెలిసొస్తుందా? ఆ రోజు నీలాగే ఓ కుర్రాడు ఎంతలా? వేడుకొన్నా నీ మనస్సు కరగలేదు". కొద్ది నెలల క్రితం జరిగిన సంఘటన గుర్తు చేశాను. ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు, సాధారణ విషయంలాగా

"సర్ అది నా విధి వృత్తిధర్మం" దానికి, దీనికి సంబంధం లేదు సమర్థించుకుంటున్నాడు.

"అయితే నా వృత్తిధర్మం నేనూ నెరవేరుస్తాను. ఆ రోజు ఆ అబ్బాయికి సరైన శిక్ష విధించావు అని సంబరపడ్డావు. కాని అది ఎంతటి దారుణానికి, దారి తీసిందో, నీకు తెలియదు. ఆ కుర్రాడు చేసిన చిన్న తప్పుకి.. చాలా పెద్ద శిక్ష విధించావు. నువ్వు దింపేసిన తర్వాత అటువైపు బస్సులు రాకపోవడంతో, చీకటి పడుతుందని ఇంట్లో కంగారు పడతారన్న తాపత్రయంతో, అడవిగుండా అడ్డదారిలో వస్తూ పాముకాటుకి గురై, కొద్ది తేడాలో బ్రతికిపోయాడు. ఇదంతా నీ మొండితనం, మూర్ఖత్వం వల్ల జరిగింది". అని ఆవేశంగా అన్నాను.

"ఇదంతా మీకెలా? తెల్సినట్లుంది" అన్నట్టు ఉన్నాయి అతని చూపులు.

"ఆ రోజు జరిగిన సంఘటనను ప్రత్యక్షంగా చూసిన సాక్షిలో నేను ఉన్నాను. ఆ కుర్రాడు మా పాలేరు రంగయ్య కొడుకు అతను పనిలోకి రావడం మానేయడంతో విషయం ఆరా తీస్తే, అసలు విషయం తెల్సింది.

"చూడు! రాంబాబూ తప్పు చేయడం, తప్పు కాదు. ఆ తప్పును ఇప్పటికీ సమర్థించుకొంటున్నావ్? చూడు, అది ఇంకా పెద్ద తప్పు. అధికారం మన చేతిలో వుంది కదా! అని ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయం తీసుకొంటే దాని పర్యవసానం ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో ఆలోచించడం మానవ ధర్మం. వృత్తి ధర్మం అని సమర్థించుకొంటున్నావ్? ఆ రోజు ఓ ఆడ మనిషి చంకలో బిడ్డతో, అవస్థ పడుతున్నా, రిజర్వ్ చేసిన సీట్లలో కూర్చోబెట్టడం నీ వృత్తిధర్మం అని తెలియదా? ఎదిగిన బిడ్డలున్నారు అంటున్నావ్? ఏం! నీ బిడ్డలు ఇలా ప్రవర్తిస్తే ఇలాగే చేసేవాడివా!" తన ప్రశ్నలు అతనికి బాణంలా తాకడంతో మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

"నీపై ఎలాంటి చర్య తీసుకోవాలో ఆలోచించి నిర్ణయిస్తాను. ఇక నువ్వు వెళ్ళవచ్చు" అని పంపించేశాను. రాత్రి వరకూ నాకూ...అతనిపై కక్ష్య తీర్చుకోవాలని బలంగా వుంది. కాని రాత్రి నాన్న అన్న మాటలతో నా నిర్ణయం మారింది.

అమ్మ పొయ్యి పై పెనం లేకుండా జొన్న రొట్టెలు కాలుస్తుంటే వేడి, వేడి రొట్టెలపై, నెయ్యి, ఆవకాయ కలిపి తింటే, ఆ ఆనందం మాటలకందదు. ఆఫీస్‌లో జరిగిన విషయం అమ్మతో చెబుతుంటే వెనుకనుండి నాన్న

"ఒరేయ్ శీనయ్యా, ఆడు చేసిన తప్పు, నువ్వు చేస్తానంటావ్?

"నాది తప్పెలా అవుతుంది నాన్న" అన్నాడు.

నాన్న అక్షరం నేర్వని జ్ఞాని అమలాపురం నుండి అమెరికా వరకు అన్ని విషయాలు మాట్లాడగలడు. భగవద్గీత శ్లోకాలు, పద్యాలు కంఠఃత చెప్పగలడు.

"మీ అమ్మదగ్గర", గేదె ఓ రోజు పాలు ఇవ్వడానికి, మొరాయించిందని కుడితి పోయడం ఆపేస్తుందా? గడ్డివేయడం మానేస్తుందా? అలా అయితే దానికి సత్తువ ఎలా వుంటుంది? మరుసటి రోజు పాలు ఎలా ఇస్తుంది"? అన్నాడు.

అందుకే అంటాను నాన్న "నువ్వు చదువుకొని వుండాల్సింది" అని. నాన్న మాటలు అనుభవాల సారాలు.



ఆగస్టు 16న కె.వి. రమణారెడ్డి రచించిన 'అశ్రుజల' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ఆవిష్కర్త డి.వి.ఎం. సత్యన్నారాయణ, ఓరుగంటి మల్లిక్, సిహెచ్.పి. వెంకటరెడ్డి, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు, నూనె అంకమ్మరావు, రచయిత కె.వి. రమణారెడ్డి, డా॥ బీరం సుందరరావు, పి. శ్రీనివాసగౌడ్, తదితరులున్నారు.

"ఆడేదో,కక్ష్య తీర్చుకొన్నాడు అని, నువ్వు అదేవన చేస్తే చదువుకొన్నాడికి, చదువురానివాడికి తేడాఏందిరా! మనిషి అన్నాక, తెలిసో, తెలియకో తప్పులు జరుగుతాయి. ఎదుట వారి బాధ తీర్చాలంటే, వృత్తిధర్మం తప్పినా... మానవతాధర్మం గెలుస్తుంది. నాలుగు మంచి మాటలు చెప్పి, హెచ్చరిస్తే సరి" అని లోపలికి వెళ్ళిపోయాడు. నాన్న అభిప్రాయంతో ఏకీభవించాలన్పించింది. చివరితప్పుగా హెచ్చరికతో వది లేయమని లేఖ పంపాను.